క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శి వెంకటేశ్ చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.15 గంటలకు కేపీహెచ్‌బీకాలనీ ఫేజ్ 1, 2, 3 రోడ్డులో సీసీ రోడ్డు, 8.30కి కేపీహెచ్‌బీ రోడ్డు నం.3లోని హనుమాన్ దేవాలయం వెనుక నూతన పార్కు ప్రారంభం, ఉదయం 8.40కి కేపీహెచ్‌బీ కాలనీ బతుకమ్మ కుంట పార్కు అభివృద్ధి, 8.50కి ఆంజనేయనగర్‌లో సీసీ రోడ్లకు రోడ్డు నెంబర్ 5, సీతారామ కల్యాణ మండపం వద్ద శంకుస్థాపన, ఉదయం 9గంటలకి హబీబ్‌నగర్, పవర్‌నగర్, శక్తినగర్‌లలో సీసీ రోడ్లకు హుస్సేన్ గల్లీ వద్ద శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు, నాయకులు పాల్గొంటారని తెలిపారు.

నాగిరెడ్డికి డాక్టరేట్

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి. నాగిరెడ్డి డాక్టరేట్ పొందారు. ఇరవై సంవత్సరాలుగా ఆయన చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేశారు.

పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలి



దేవినగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దేవినగర్‌కాలనీ రోడ్ నం. 4లో రూ.19లక్షలతో సీసీరోడ్డు పనులను చేపట్టారు. మంగళవారం ఈ పనులను కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. సీసీరోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్, బీఆర్ఎస్ బస్తీ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలి

బాలానగర్: మహిళా రెజ్లర్లపైన లైంగిక వేధింపులకు పాల్పడ్డ బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని బాలానగర్ సీఐటీయూ మండల కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం కమిటీ సభ్యులు భవన నిర్మాణ కార్మికులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడారు. దేశానికి గోల్డ్ మెడల్స్ తీసుకొచ్చిన మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. ఆలిండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలన్నారు. రెజ్లర్ల పోరాటానికి కార్మిక వర్గం అండగా నిలుస్తుందన్నారు. కార్మికులను ఐక్యం చేసి రెజ్లర్లకు అండగా పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు సుబ్బారావు, లచ్చమ్మ, యాదమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో రాయల సేవా సమితి పాత్ర కీలకం

అమీర్‌పేట: పర్యావరణ పరిరక్షణలో రాయల సేవా సమితి కీలక పాత్ర పోషిస్తుందని ప్రగతి గ్రూప్ చైర్మన్ జీబీకే. రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన దిశగా పని చేస్తున్న వారిని సోమవారం రాత్రి అమీర్‌పేటలో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రాబ్స్, రాయల సేవా సమితి వంటి స్వచ్ఛంద సంస్థలు పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నాయన్నారు. పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల కలిగే నష్టాలు ప్రజలకు వివరించాలన్నారు. రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారని సూచించారు.

పారిశ్రామిక రంగంలో తెలంగాణ ముందుంది

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- టీఎస్ఐఐసీ కార్యాలయంలో పారిశ్రామిక ప్రగతి కార్యక్రమం



పారిశ్రామిక ప్రగతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఫతేనగర్ జింకలవాడలోని టీఎస్ఐఐసీ కార్యాలయంలో ×పారిశ్రామిక ప్రగతి×కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై ప్రసంగించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాలతో పాటు పారిశ్రామిక రంగంలోనూ ముందుందని అన్నారు. ఎంతో మంది పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లో వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా దేశంలోని ఎంతో మంది యువతి, యువకులు ఉపాధి పొందుతున్నారని అన్నారు.

◆ 24గంటల పాటు విద్యుత్ అందిస్తూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసే యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ టీఎస్ఐపాస్, టీ హబ్ వంటివి ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. హైదరాబాద్ దేశంలోనే అతి పెద్ద మహానగరంగా ప్రశాంతమైన నగరంగా మారిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, డిసిల రవీంద్ర కుమార్, రవికుమార్, పారిశ్రామికవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన...

రజక సంఘం భవన నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అన్ని కులాలు, మతాల వారికి కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నామన్నారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పరిష్కారమవుతున్నాయని తెలిపారు.



రజక సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



తులసీవనం ఫేజ్–2లో రెడీమిక్స్ యూనిట్

రెడీమిక్స్ యూనిట్‌ను తరలించాలి

ఆల్విన్‌కాలనీ: తులసీవనం ఫేజ్–2లో నిర్మాణం కోసం వాడే రెడీమిక్స్ తయారు చేసే ఆర్ఎంసీ యూనిట్‌ను తరలించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. సనత్‌నగర్‌లోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు మంగళవారం ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్ఎంసీ యూనిట్‌ని నివాసాల మధ్యలో ఏర్పాటు చేశారన్నారు. ఈ యూనిట్ నుంచి వచ్చే రసాయనాల దుర్వాసనతో ప్రజలకు శ్వాసకోస వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ యూనిట్ రసాయన వ్యర్థాలు నేరుగా పక్కనే ఉన్న నాలాలోకి చేరుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పీసీబీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కుమార్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ కాలనీకి చెందిన ట్వికింల్‌కు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.1.4లక్షల చెక్కును మంగళవారం ఎమ్మెలే అరెకపూడి గాంధీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, తిరుపతి యాదవ్, అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

తాగునీరు రోడ్డుపాలు

- నెల రోజులుగా వృథాగా పోతున్న నీరు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఆల్విన్‌కాలనీ: తాగునీటి పైపులైన్ లీకేజీల ద్వారా గ్యాలన్ల కొద్ది తాగునీరు వృథాగా పోతోంది. వివేకానందనగర్‌కాలనీ శ్రీచిత్తారమ్మ దేవాలయం వద్ద ప్రధాన రహదారిలో ప్రధాన పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. నెల రోజులుగా తాగునీరు వృథాగా రోడ్డుపాలవుతోంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. లీకేజీ ఏర్పడటంతో కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టి లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



చిత్తారమ్మ ఆలయం సమీపంలోని వాల్వ్ లీకేజీతో రోడ్డుపై పారుతున్న తాగునీరు

సమతానగర్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు


- బీజేపీ సీనియర్ నాయకుడు రవికుమార్‌యాదవ్

భాగ్యనగర్‌కాలనీ: గడప గడపకు బీజేపీ – రవన్న ప్రజాయాత్ర మంగళవారం హైదర్‌నగర్ డివిజన్, సమతానగర్, భాగ్యనగర్ ఫేజ్ 3లో కొనసాగింది. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా అడ్డగుట్ట సొసైటీ రోడ్లపై రాళ్లతో కూడిన భారీ గేట్లు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు బీజేపీ సీనియర్ నాయకుడు రవికుమార్‌యాదవ్ దృష్టికి తీసుకొచ్చారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని, ట్రాఫిక్ నియంత్రణ చేయాలంటే ప్రగతినగర్ నుంచి అడ్డగుట్ట సొసైటీ వరకు ఫ్లై ఓవర్ వంతెన నిర్మించాలన్నారు. సమతానగర్, అడ్డగుట్ట సొసైటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించటంలో ముందుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్, శేషయ్య, ఎంకే దేవ్, సీతారామరాజు, నాగిరెడ్డి, శ్రీనివాసులు, కృష్ణంరాజు, రాజారెడడ్డి, సునీల్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతిలో మేడ్చల్‌కు ప్రథమ స్థానం

ప్రగతి కార్యక్రమంలో మంత్రి సీహెచ్ మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పారిశ్రామిక ప్రగతిలో దేశంలోనే తెలంగాణ దూసుకెళ్తోందని, దీనికి సీఎం కేసీఆర్ కృషి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పట్టుదల కారణమని మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. పారిశ్రామిక రంగంలో మేడ్చల్ తెలంగాణలో మొదటిస్థానంలో ఉండటం అదృష్టంగా, గర్వంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని విష్ణుల్యాబ్స్ లిమిటెడ్, జినోమ్ వాలీలో నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్‌తో కలిసి ఆయన మొక్కలను నాటారు. ఆ తర్వాత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎక్కువ సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న వినూత్న, పారిశ్రామిక విధానాలతో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఎన్నింటికో తెలంగాణ కేరాఫ్‌గా మారిందన్నారు. తెలంగాణకు ఎన్నో కొత్త పరిశ్రమలు వస్తున్నాయని, గతంలో మాదిరిగా ఎలాంటి పవర్ హాలీడేలు లేకుండా 24 గంటల విద్యుత్తు అందించడం వల్లే సాధ్యమవుతోందన్నారు. కరోనా సమయంలో జీనోమ్ వ్యాలీలో వ్యాక్సిన్ కనిపెట్టడం ప్రపంచానికే గర్వకారణమని తెలిపారు. ఈ కరోనా వ్యాక్సిన్‌ను ప్రపంచ దేశాలకు 35 శాతం అందించిందన్నారు. ఇలాంటి పెద్ద పరిశ్రమ మేడ్చల్ నియోజకవర్గంలో ఉండటం అదృష్టమన్నారు.



టీఎస్ ఐపాస్ వల్ల ఎంతో అభివృద్ధి: కలెక్టర్ అమయ్‌కుమార్

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ ఐపాస్, టీఎస్ బీపాస్‌తో ఎంతో అభివృద్ధి జరుగుతోందని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. టీఎస్–ఐపాస్‌తో కొత్త పరిశ్రమల స్థాపన, వాటికి అనుమతులు సులభతరం అయ్యాయన్నారు. ఉద్యోగ కల్పనలో హైదరాబాద్ దేశంలోని ఇతర రాష్ట్రాలను అధిగమించి ప్రథమ స్థానంలో నిలిచిన తీరును ఆయన వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లుబాయ్, జెడ్పీటీసీలు అనిత, శైలజ, కో ఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు, పరిశ్రమల అధిపతులు, జోనల్ మేనేజర్ మాధవి ఏడీ వెంకటేశ్వర్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, జినోమ్ వాలీ పరిశ్రమ అధిపతులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో నాలుగు స్టార్టప్‌లు ప్రారంభం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో ఇంక్యుబేషన్ సెంటర్‌గా గుర్తింపు పొందిన సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(సీఐఈ) ఆధ్వర్యంలో ఆవిష్కార్ డీప్ టెక్ యాక్సిలరేటర్ సమ్మర్–2023 కోహార్ట్‌ను ప్రారంభించారు. కోహార్ట్ డీప్ టెక్, మెడ్‌టెక్, మీడియాటెక్, మొబిలిటీ డొమైన్ నాలుగు స్టార్టప్‌లతో ప్రారంభించారు. ఈ స్టార్టప్‌లు సీడ్ ఫండ్‌తో పాటు 6నెలల ప్లాన్‌ను అందుకుంటాయి.

గురుకుల పాఠశాలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల నల్లగండ్ల ప్రైమరీ స్కూల్ నుంచి గురుకుల స్కూల్‌కు 6 గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఎ.మహేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. 4వ తరగతి విద్యార్థులు యశ్వంత్, నాని, శిరీష, రాజేశ్వరి, మోక్షిత్, ఆంజనేయులు ఎంపికయ్యారని వివరించారు. వారికి టీసీ, స్టడీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు రవీందర్‌రెడ్డి, సుజాత, రమణి, దీక్షిత్‌లు పాల్గొన్నారు.

ఐటీఐలో చేరేందుకు 10లోపు దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ఒక సంవత్సరం కోర్సులైన డీజిల్ మెకానిక్, వెల్డర్, రెండు సంవత్సరాల కోర్సులైన టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రిషన్, ఎలక్ట్రానిక్స్ వంటి ట్రేడ్స్‌లలో చేరేందుకు ఈ నెల 10వ తేదీలోపు పదో తరగతి ఉత్తీర్ణత చెంది, 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు www.iti.teanfana.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది

మాదాపూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జోనల్ మేనేజర్ టీఎస్ఐఐసీ సైబరాబాద్ ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్ పరిధిలోని టెక్‌మహేంద్ర లెర్నింగ్ వరల్డ్ మీటింగ్ హాల్‌లో విద్యుత్ విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవేళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు రాగం నాగేందర్, వెంకటేశ్, డీసీ వెంకన్న, డీసీ సుధాంషు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పారిశ్రామిక రంగం దూసుకుపోతోందని, హైదరాబాద్ నగరం విశ్వనగరంగా దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని, సిలికాన్ వ్యాలీకి దీటుగా టీ–హబ్, వీ–హబ్‌లు ఉన్నాయన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మెజారిటీ ఐటీ కంపెనీలు కేంద్రీకృతమయ్యాయని, రోడ్లు, డ్రైనేజీ, కరెంటు, తాగునీరు, విద్య, వైద్యం, ఆరోగ్యం సమర్థంగా అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, ఏసియా గ్లోబల్ హెడ్ మైండ్ స్పేస్ సీవిన్ వర్మ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కంటోన్మెంట్: స్థానిక యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ నెల 9న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ తెలిపారు. కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ ఈ మేళాకు ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మధుకర్ నాయక్‌ను కలిసి బోర్డు తరఫున తగిన సదుపాయాలు కల్పించాలని కోరామన్నారు. సుమారు 90కి పైగా సంస్థలు పాల్గొనే ఈ జాబ్‌మేళా విజయవంతానికి తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందని సీఈఓ హామీ ఇచ్చారన్నారు.

ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ నూతన కమిటీ



నియామక పత్రాలు అందుకున్న డివిజన్ నూతన కమిటీ సభ్యులతో గొట్టిముక్కల వెంగళరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడు కె.రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దూరి రాము ఆధ్వర్యంలో డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు పాల్గొని నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. డివిజన్ ఉపాధ్యక్షుడిలుగా సయీద్ ఏజాజ్ అలీ, ఎల్.నర్సింగ్‌రావు, జి.చంద్రమోహన్‌గౌడ్, ఎండీ హమీద్‌ఖాన్, కంచి కుమారస్వామి, మందుగుల సంతోష్‌కుమార్, ట్రెజరర్‌గా కేసీ బాబు, జనరల్ సెక్రటరీలుగా గంధం చంద్రశేఖర్, కె. క్రాంతికుమార్, ఎం. ఇక్షం గోవన్, కె. వెంకటేష్, గంటా వరహాలస్వామి తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజు ముదిరాజ్, సూరజ్‌కుమార్ తివారి, సయిద్ మిస్బా, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్‌గా డా.జి.విశ్వతేజరావు నియామకం



రాష్ట్ర టీపీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్‌గా నియామకపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ గొట్టిముక్కల విశ్వతేజరావు

కూకట్‌పల్లి: మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ సమక్షంలో మంగళవారం గాంధీ భవన్‌లో డా. విశ్వతేజరావును రాష్ట్ర టీపీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్‌గా నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం సీనియర్ నాయకులు వి. హనుమంతరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నిరంజన్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బీ–బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేంద్ర, సూరజ్‌కుమార్ తివారి, రాజు ముదిరాజు, ఎన్ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయీద్ మిస్బా, తూము సంతోష్‌కుమార్, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సుధాకర్‌రెడ్డి, బండారి ప్రవీణ్‌గౌడ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలకు ఏర్పాట్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ నెల 11న జరిగే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలను మేడ్చల్ జిల్లాలో 49,660 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తుండగా, వీరి కోసం 101 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ లింగ్యానాయక్, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి సమష్టిగా పనిచేయాలి

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారుల సమష్టిగా కృషి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8న బాచుపల్లి భైరుని చెరువు వద్ద దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఇరిగేషన్, ఆయా విభాగాల అధికారులతో మేయర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ చెరువులను ఆధునీకరించి మత్స్యకారులకు లాభదాయకంగా మార్చిందన్నారు. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో రైతులు హాజరయ్యే అవకాశముందని తెలిపారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఆగం పాండుముదిరాజ్, కాసాని సుధాకర్ ముదిరాజ్, అధికారులు పాల్గొన్నారు.




అధికారులతో సమావేశమైన మేయర్ నీలారెడ్డి

సమన్వయంతో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 12 నుంచి ఇంటర్, 14 నుంచి పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి సూచించారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని కోరారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 86 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 34,705 మంది, సెకండ్ ఇయర్‌కు సంబంధించి 13,440 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ఈ నెల 12 నుంచి 20 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్ జూనియర్ విద్యార్థులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ సీనియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు ఉంటాయన్నారు.



పదో తరగతి పరీక్షలు

ఈ నెల 14 నుంచి 22 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి తెలిపారు. పదో తరగతికి సంబంధించి 4,443, మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, 21 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటలరకు జరుగుతాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్షా కేంద్రానికి, మళ్లీ పరీక్షా కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూమ్ వరకు ఎగ్జామ్ మెటీరియల్‌ను తరలించడంలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్తు సరఫరా, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీటి వసతి అన్నీ ఉండేలా చూడాలన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులో నిందితుడు

కేపీహెచ్‌బీకాలనీ: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఓ మోసగాడిని కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో నివాసం ఉండే అశ్వక్ హుస్సేన్ ఉద్యోగ అన్వేషణ కోసం ఆన్‌లైన్ వెబ్ సైట్లను ఆశ్రయించాడు. ఈ క్రమంలోనే సునీల్ కుమార్‌రెడ్డి అనే వ్యక్తి అశ్వక్ హుస్సేన్‌కు ఫోన్ చేసి తాను సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించారు. అందుకు గాను మొదట 32,500 రూపాయలను గూగుల్ పే ద్వారా తన అకౌంట్‌లోకి వేయించుకున్నాడు.

◆ అనంతరం బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్, సెక్యూరిటీ డిపాజిట్ పేరుతో మొత్తం 2 లక్షల 20 వేల రూపాయలను తన ఖాతాలోకి వేయించుకున్నాడు. కొద్ది రోజుల తరువాత ఒక ఫేక్ ఆఫర్ లెటర్‌ను తయారు చేసి అశ్వక్ హుస్సేన్‌కు ఇచ్చాడు. అది ఫేక్ లెటర్ అని తెలుసుకున్న అశ్వక్ హుస్సేన్ సునీల్ కుమార్ రెడ్డికి ఫోన్‌చేసి నిలదీయటంతో పాటు తన డబ్బు తనకు వాపస్సు ఇవ్వాలని డిమాండ్ చేశాడు.

◆ దీంతో సునీల్ కుమార్ రెడ్డి డబ్బులు ఇవ్వక పోగా అశ్వక్ హుస్సేన్‌ను బెదిరింపులకు గురిచేశాడు. అశ్వక్ హుస్సేన్‌తో పాటు ఆనంద్, సునీల్, గోవర్ధన్, స్వాతి, సంతోష్, నవీన్ వంటి నిరుద్యోగులను కూడా సునీల్ కుమార్ రెడ్డి మోసం చేసినట్లు గుర్తించిన పోలీసులు సునీల్ కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అతనిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.